# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-07-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచ స్థాయి ఆర్థిక కేంద్రంగా రాజధాని అమరావతిని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**
2. **ఆక్వా రంగాన్ని శాస్త్రీయ విధానాలతో బలోపేతం చేస్తామన్న ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు .**
3. **ఆంధ్రప్రదేశ్ లో పోర్టులను ప్రైవేటీకరించడం లేదని స్పష్టం చేసిన మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి.**
4. **తెలంగాణలో ఈ రోజు నుంచి ప్రారంభం కానున్న ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు.**

=========================

ప్రపంచ స్థాయి ఆర్థిక కేంద్రంగా రాజధాని అమరావతిని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతి-2.0 సమీకృత బృహత్ ప్రణాళికపై, సింగపూర్ ప్రతినిధులు, అధికారులుతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఉపాధి అవకాశాలు పెరిగేలా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లతో అంతర్జాతీయ ప్రమాణాల నగరంగా అమరావతిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రీన్ ఎనర్జీ విధానాలతో పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు ఛానల్ విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు ఛానల్ విస్తరణ, ఆధునికీకరణ పనుల పురోగతిని ఆయన నిన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, భూసేకరణలో రైతులకు పరిహారం చెల్లిస్తూ పనులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. తొలి 47 కిలోమీటర్ల ఆధునికీకరణకు 370 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ల ప్రక్రియ ప్రారంభమైందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

-------------------------

ఆక్వా సాగు రంగంలో పారదర్శకత, శాస్త్రీయ విధానాలతో స్థిరత్వం తీసుకొస్తామని ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రొయ్యల మేత, కొనుగోలు ధరలు, ఆక్వాకల్చర్ రంగ సమస్యలపై కృష్ణాజిల్లా పెనమలూరులో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మేత ధరల నిర్ణయంలో పూర్తి పారదర్శకత పాటించాలని, రైతులకు సరైన సమాచారం అందించి అపోహలకు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలుపుతూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

తెలుగువారు గర్వించదగ్గ గాయకురాలు ఎస్. జానకి అని ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన ఎస్. జానకి స్మృత్యంజలి కార్యక్రమం, వందేమాతరం గీతం 150 సంవత్సరాల వేడుకల్లో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్. జానకి 17 భాషల్లో వేలాది పాటలు పాడి భారతీయ సంగీత రంగంలో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. అలాగే వందేమాతరం గీతం దేశభక్తికి ప్రతీకగా నిలిచిందని, యువతలో జాతీయ భావన పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించవలసిన అవసరం ఉందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ మహిళల భద్రత కోసం రూపొందించిన 'అభయ' కార్యక్రమాన్ని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత నక్కపల్లిలో నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళలపై నేరాల నివారణ, బాధితులకు తక్షణ సహాయం, నేరస్థులపై కఠిన చర్యలే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళల రక్షణకు ప్రాధాన్యతనిస్తూ రాబోయే 100 రోజుల్లో పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలియజేశారు.

---------------------------

భారత్-యునైటెడ్ కింగ్డమ్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం -సీఈటీఏ అమలులోకి వచ్చిన నేపథ్యంలో హైదరాబాద్ సనత్‌నగర్‌లోని ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో నుంచి యూకేకు వెళ్లే ఎగుమతి కంటైనర్లను తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణ ఆదిత్య నిన్న జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత్-యూకే ఆర్థిక, వాణిజ్య సంబంధాల్లో ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తగ్గడంతో తెలంగాణ నుంచి ఎగుమతులు మరింత పెరుగుతాయని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పోర్టులను ప్రైవేటీకరించడం లేదని, వాటిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.. అమరావతిలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నిన్న ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం-పీపీపీ విధానం ప్రైవేటీకరణ కాదని, పోర్టుల యాజమాన్యం నియంత్రణ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని తెలిపారు. విధానం ద్వారా ఆధునిక సాంకేతికత, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ..30...సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ సత్యసాయి జిల్లా రామగిరిలో మూతపడిన బంగారు గనులను గనులు, భూగర్భశాఖ మంత్రి కొల్లు రవీంద్ర నిన్న పరిశీలించారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు బంగారు గనులను తిరిగి ప్రారంభించాలని చేసిన విజ్ఞప్తి మేరకు గనుల ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, అవసరమైన చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్ ..25..సెకన్లు

--------------------------

తెలంగాణలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ఈ రోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబికా మహంకాళి ఆలయంలో ప్రభుత్వం తరఫున తొలి బోనం సమర్పించడంతో ఉత్సవాలకు అధికారికంగా శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ఆగస్టు 2వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 15 కోట్ల 5 లక్షల రూపాయలను కేటాయించింది.

--------------------------

భారతీయ చేనేత ఉత్పత్తులను ఆధునిక సాంకేతికతతో అంతర్జాతీయ మార్కెట్లకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందని రాజ్యసభ సభ్యులు వి. విజయేంద్ర ప్రసాద్ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న భారత్ టెక్స్-2026 ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను ఆయన నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్ర చేనేత, జౌళి ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాల్లో దిగువ ట్రోపో ఆవరణంలో వాయువ్య దిశ నుంచి గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

తెలంగాణలోని పలు జిల్లాల్లో రాబోయే రెండు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 136వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు.

=====================